క్లుప్తంగా

బీఆర్ఎస్ పట్టణ మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పరిమళ


నియామక పత్రం అందుకుంటున్న పరిమళ

తాండూరు టౌన్ : బీఆర్ఎస్ పార్టీ పట్టణ మహిళా విభాగ్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మాజీ కౌన్సిలర్ పరిమళను నియమిస్తూ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం ఆయన నివాసంలో పరిమళకు నియామక పత్రం అందజేశారు. సంక్షేమ పథకాలపై మహిళలకు అవగాహన కల్పించాలన్నారు. తనపై నమ్మకంతో పదవీని అప్పగించిన పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన వార్డు మెంబర్


నాయకులను అభినందిస్తున్న ఎమ్మెల్యే

ధారూరు: మండల పరిధిలోని స్టేషన్ ధారూరు గ్రామ పంచాయతీ వార్డు మెంబర్ ప్రవీణ్, కాంగ్రెస్ నాయకుడు అవినాశ్‌లు సోమవారం బీఆర్ఎస్‌లో చేరారు. వీరిని ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో రవిశంకర్, శ్రీనివాస్, బాల్‌రాజ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు రాజీనామా


మండల కోఆప్షన్ సభ్యుడు ఇస్మాయిల్

ధారూరు: ధారూరు మండల పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు ఇస్మాయిల్ సోమవారం ఆ పార్టీకి, ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. బీఆర్ఎస్ పార్టీ పరంగా ఏ కార్యక్రమం జరిగినా ఆహ్వానించకపోవడం, ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రోటోకాల్ పాటించకపోవడం, ఎమ్మెల్యే ఆనంద్ వ్యవహారశైలి, ముస్లిం మైనార్టీలపై చిన్నచూపు చూస్తారనేది తేటతెల్లమైందని ఇస్మాయిల్ పేర్కొన్నారు. ఎమ్మెల్యే వైఖరి నచ్చకనే పార్టీ వీడుతున్నట్లు ఆయన చెప్పారు.

సభకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు


సభకు బయలుదేరిన నాయకులు


ధారూరు: మండంలోని 32 గ్రామ పంచాయతీల నుంచి కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు సోమవారం రేవంత్ సభకు తరలివెళ్లారు. వాహనాలకు పార్టీ జెండాలు కట్టుకుని జై రేవంత్, జై కాంగ్రెస్ అంటూ నినాదాలు చేస్తూ వెళ్లారు. మండల పార్టీ అధ్యక్షుడు విజయభాస్కర్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ రాములు, నాయకులు మమ్మద్ బాబాకాన్ తదితరులు సారథ్యం వహించారు.

నూతన నియామకం


సుధాకర్‌గౌడ్‌ను సన్మానిస్తున్న నాయకులు

తాండూరు రూరల్: బీఆర్ఎస్ మండల యూత్ ప్రెసిడెంట్‌గా కరన్‌కోట్ గ్రామానికి చెందిన కొత్త సుధాకర్‌గౌడ్‌ను నియమించారు. ఈ మేరకు సోమవారం ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి తన నివాసంలో నియామకపత్రం అందజేశారు. నూతనంగా ఎన్నికైన సుధాకర్‌గౌడ్‌ను స్థానిక బీఆర్ఎస్ నాయకులు శాలువా పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఉమాశంకర్, కరన్‌కోట్ ఉప సర్పంచు హేమంత్‌కుమార్‌లు ఉన్నారు.

ప్రమిదలు సిద్ధం


ఎండలో ఆరబెట్టిన ప్రమిదలు

కొడంగల్ : దసరా, దీపావళి పండుగలను పురస్కరించుకొని దీపాలు వెలిగించడానికి ప్రమిదలను సిద్ధం చేశారు. పట్టణంలోని కుమ్మరి కులస్తులు వివిధ రూపాల్లో ప్రమిదలను తయారు చేశారు. మార్కెట్‌లోకి తరలించి విక్రయాలకు రెడీ చేస్తున్నారు.


అనంతగిరి: బ్రహ్మచారిణి రూపంలో దర్శనమిచ్చిన అమ్మవారు


కొడంగల్ రూరల్ : గుండ్లకుంటలో ప్రతిష్ఠించిన దుర్గామాత


దారూరు: గాయత్రీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు

అపురూపం

దేవీ నవరాత్రులను పురస్కరించుకుని అమ్మవారు రెండోరోజు సోమవారం బ్రహ్మచారిణి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. జిల్లాలోని ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన మండపాల వద్ద అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. పలు చోట్ల అమ్మవారికి సుప్రభాత సేవ, అర్చనలు, అభిషేకాలు చేశారు. అనంతరం భక్తులు, లలిత సహస్రనామ పారాయణం చేసి నైవేద్యం సమర్పించి ప్రత్యేక హారతి ఇస్తూ, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

– సాక్షి, నెట్‌వర్క్


కొడంగల్ రూరల్ : ఎస్ఎస్‌కె ఆధ్వర్యంలో అమ్మవారి పూజల్లో పాల్గొన్న భక్తులు


కొడంగల్ రూరల్ : రుద్రారంలో ప్రతిష్ఠించిన దుర్గామాతకు పూజలు చేస్తున్న కమిటీ సభ్యులు


దౌల్తాబాద్: యాంకిగ్రామంలో పూజలు చేస్తున్న భక్తులు


తాండూరు టౌన్: లలిత సహస్రనామ పారాయణం చేస్తున్న భక్తులు

'శాలివాహన'లో ఫీజుల దోపిడీ

- ఉచితమని చెప్పి రూ.5 వేలు వసూలు
- రూ.1000 ఇస్తేనే టీసీ, బోనఫైడ్


తాండూరు టౌన్‌లోని శాలివాహన డిగ్రీ కళాశాల

తాండూరు టౌన్ : పట్టణంలోని శాలివాహన డిగ్రీ కళాశాలలో ఫీజుల దోపిడీ కొనసాగుతోందని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మానేశ్వర్ చారి అన్నారు. కళాశాల యాజమాన్యం బలవంతంగా విద్యార్థుల నుంచి అక్రమ ఫీజులు వసూలు చేస్తోందని వచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం యాజమాన్యాన్ని నిలదీశారు. ఈ సందర్భంగా మానేశ్వర్ చారి మాట్లాడుతూ.. డిగ్రీలో అడ్మిషన్ పొందేటపుడు ఉచిత విద్య అని చెప్పి కోర్సు పూర్తయిన తర్వాత విద్యార్థుల నుంచి బలవంతంగా రూ.5వేలు వసూలు చేస్తున్నారన్నారు. టీసీ, బోనఫైడ్ సర్టిఫికెట్ల కోసం రూ.వేయి వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఉస్మానియా యూనివర్సిటీ నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా ఫీజులు వసూలు చేస్తున్న శాలివాహన డిగ్రీ కళాశాల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులను నిలువు దోపిడీ చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. లేని యెడల ఏబీవీపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఆందోళనలో ఏబీవీపీ నాయకులు వినోద్, మహేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హనుమంత వాహనంపై స్వామివారు


హనుమంత వాహనంపై ఊరేగిన స్వామివారు

అనంతగిరి: దసరా నవరాత్రులను పురస్కరించుకుని వికారాబాద్ పట్టణ ఆలంపల్లిలోని శ్రీ అనంతపద్మనాభస్వామి ఆలయ ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి స్వామివారు హనుమన్ వాహనంపై ఊరేగారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు.

అక్రమ కేసు కొట్టివేత


నాంపల్లి కోర్టు ఎదుట అప్పటి టీడీపీ నాయకులు

మోమిన్‌పేట: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యాలయాన్ని 2016లో అప్పటి టీడీపీ ఆధ్వర్యంలో ముట్టడించడంతో ప్రస్తుత బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కరణం రామకృష్ణతో పాటు మరో 15 మందిపై అక్రమంగా కేసు పెట్టారు. ఎనిమిది సంవత్సరాల తర్వాత సోమవారం నాంపల్లి కోర్టు కేసును కొట్టి వేసిందని కరణం రామకృష్ణ తెలిపారు.

వైఎస్సార్‌టీపీ టికెట్‌కు దరఖాస్తు


టికెట్ కోసం దరఖాస్తు చేస్తున్న నరేందర్

పరిగి: వైఎస్ఆర్‌టీపీ పరిగి అసెంబ్లీ టికెట్‌ను ఇవ్వాలని కోరుతూ సోమవారం హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో రాష్ట్ర అధికార ప్రతినిధి పిట్టరాంరెడ్డి నరేందర్ దరఖాస్తు చేసుకున్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ఉన్నప్పటి నుంచి వైఎస్ షర్మిల పార్టీ పెట్టేంత వరకు పార్టీలోనే కొనసాగామన్నారు. ఎక్కడ చూసినా వైఎస్సార్ చేసిన అభివృద్ధే కనిపిస్తుందని తెలిపారు. షర్మిల పాదయాత్ర ద్వారా ప్రజల్లో పార్టీపై విశ్వాసం పెరిగిందన్నారు. బీఆర్ఎస్ చేసిన అవినీతిని ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రతి మంగళవారం సెలవు ఇవ్వాలి

వికారాబాద్ అర్బన్: మున్సిపల్ కార్మికులకు ప్రతి మంగళవారం సెలవు ఇవ్వాలని, పండుగ రోజు సెలవు ప్రకటించాలని మున్సిపల్ కార్మికులు కమిషనర్ జాకీర్ అహ్మద్‌కు వినతి పత్రం అందజేశారు. 14 మంది కార్మికులకు గత సంవత్సర కాలంగా వేతనాలు ఇవ్వలేదని వెంటనే వేతనాలు చెల్లించాలని కమిషనర్‌ను కోరారు. ప్రతిరోజు కేవలం 8 గంటలు మాత్రమే పని కొనసాగించాలని, పైఅధికారుల వేధింపులు ఆపాలని వారు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. పీఎఫ్ పెండింగ్ డబ్బులు వెంటనే కార్మికులకు ఇవ్వాలని, ఈఎస్ఐ ఆస్పత్రిని వికారాబాద్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్ మైపాల్ మున్సిపల్ యూనియన్ నాయకులు శంకర్ బుచ్చయ్య రాజు శంకరమ్మ బందెమ్మ చమలమ్మ జ్యోతి అనసూయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.


కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కార్మికులు

పోటాపోటీగా ఆర్థిక సాయం

పెద్దేముల్: ఎన్నికల సమయం దగ్గర పడుతుండటంతో గ్రామాల్లో రాజకీయం జోరందుకుంది. కార్యకర్తలకు అండగా ఉండేది తమ పార్టీ అంటూ బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు పోటీ పడుతున్నారు. సోమవారం పెద్దేముల్ మండల కేంద్రంలో బాలప్ప కుమారుడు పాండు అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు వారి ఇంటి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కాంగ్రెస్ పార్టీ నుంచి మండల జెడ్పీటీసీ సభ్యుడు ధారాసింగ్ రూ.5వేల ఆర్థిక సహాయం అందచేయగా, మరో వైపు బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు కోహీర్ శ్రీనివాస్, రైతు సేవా సహకార సంఘం చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి రూ.5వేలు, మరోకరు రూ.6వేల ఆర్థిక సహాయం అందచేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలో పని చేసే ప్రతి కార్యకర్తకు తాము అండగా ఉంటామని తెలియచేశారు. కార్యక్రమంలో నాయకులు ఎల్లారెడ్డి, నర్సిములు, వెంకట్, తదితరులు పాల్గొన్నారు.


ఆర్థిక సహాయం అందచేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మొక్కలు నాటిన అధికారులు


ఖానాపూర్‌లో మొక్కలు నాటించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

పెద్దేముల్: కాగితాల్లోనే మొక్కల లెక్క అనే శీర్షికతో సాక్షి లో ప్రచురితమైన వార్తకు సోమవారం మండల అధికారులు స్పందించారు. పెద్దేముల్ మండల ఖానాపూర్ వద్ద గుంతల్లో పడేసి ఎండిపోయిన మొక్కలను పరిశీలించి వాటి స్థానంలో పంచాయతీ కార్యదర్శి ఉపాధి హామీ సిబ్బంది ద్వారా కొత్త మొక్కలను నాటించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ లక్ష్మప్ప పలు గ్రామాలకు వెళ్లి ప్రధాన రహదారులపై నాటిన మొక్కలను పరిశీలించారు. ఎండిపోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలు నాటించాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. మొక్కలు సంరక్షణ సక్రమంగా లేక నిర్లక్ష్యంతో ఎండిపోతే తప్పకుండా వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. నాటిన ప్రతి మొక్కనే కాపాడాలని సూచించారు. ఇక ముందు మొక్కలు ఎండిపోయాయని ఫిర్యాదులు వచ్చినా...పత్రికల్లో వచ్చిన ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందని తెలియచేశారు.

అధిక ఆదాయానికి ఆర్టీసీ కృషి

పరిగి డీఎం కర్ణశ్రీ


ప్రతిజ్ఞ చేస్తున్న సిబ్బంది

పరిగి: ఆర్టీసీ ఉద్యోగులు ఈ పండుగ సీజన్‌లో ఆర్టీసీకి అధిక ఆదాయం తీసుకురావాలని పరిగి ఆర్టీసీ డీఎం కర్ణశ్రీ సూచించారు. గ్రాండ్ ఫెస్టివల్ చాలెంజ్ సందర్భంగా డిపోలో చాలెంజ్ జెండాను ఎగరవేసి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఉద్యోగులందరూ పండుగల సందర్భంగా అత్యధిక వాల్యూమ్, ఈపీకే తీసుకురావాలని కోరారు. ఈ నెల 18 నుంచి 30 వరకు ప్రయాణికుల కోసం ప్రత్యేక బహుమతులను అందజేస్తున్నామని తెలిపారు. ఆర్టీసీ బస్సులో ప్రయాణించిన వారు టికెట్ వెనుకాల వారి పేరు ఫోన్ నంబర్ రాసి బస్‌స్టేషన్ పరిధిలోని గిఫ్ట్ బాక్స్‌లో వేయాలన్నారు. డ్రాలో గెలుపొందిన ప్రయాణికులకు రూ. 9900 విలువ గల బహుమతిని అందజేస్తామన్నారు. కావునా, ప్రయాణికులు ఆర్టీసీలో ప్రయాణించి సురక్షితంగా ఇంటికి చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంఘం మండల అధ్యక్షుడిగా గోవర్ధన్


నియామక పత్రం అందుకుంటున్న గోవర్ధన్

దోమ : బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడుగా ఐనాపూర్ గ్రామానికి చెందిన గోవర్ధన్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ఉన్న బీసీలను ఏకతాటిపైకి తెచ్చేందుకు తాను నిరంతరం పాటుపడుతూ.. బీసీలకు జరుగుతున్న అన్యాయాలపై పోరాటం చేస్తానని అన్నారు. అత్యాధిక జనాభా కలిగిన బీసీలకు ప్రభుత్వాలు చట్టసభల్లో సరైన అవకాశాలు కల్పించకపోవడం బాధాకరమన్నారు. బీసీల పట్ల ప్రభుత్వాలు చిత్తశుద్ధితో వ్యవహరించి చట్టసభల్లో సరైన అవకాశాలను కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బీసీలంతా కలిసి నిరసనలు చేపడుతామని హెచ్చరించారు. అనంతరం ఆర్.కృష్ణయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ లాల్‌కృష్ణప్రసాద్, కార్యదర్శి హన్మంతు ముదిరాజ్, జిల్లా ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు రామకృష్ణ ధనేశ్వర్, మండల ముదిరాజ్ సంఘం ప్రధానకార్యదర్శి చందు, జిల్లా కార్యదర్శి సంజీవ్, బీసీ సంఘం నేతలు పాల్గొన్నారు.

ఉచితంగా కంటి ఆపరేషన్లు

మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి


పరీక్షలు చేస్తున్న ఆప్తాల్మిక్ అధికారి హరినాథ్

కొడంగల్ : నియోజకవర్గంలోని పేదలకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి ఆపరేషన్లు చేయిస్తున్నట్లు కొడంగల్ లయన్స్ క్లబ్ ఫౌండర్, మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వాసుత్రిలో సోమవారం ఉదయం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఆప్తాల్మిక్ అధికారి లయన్ హరినాథ్ కంటి పరీక్షలు చేశారు. లయన్స్ క్లబ్, జిల్లా అంధత్వ నియంత్రణ సంస్థ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సంయుక్త ఆధ్వర్యంలో పేదలకు ఉచితంగా కంటి పరీక్షలు చేస్తున్నట్లు చెప్పారు. కంటి సమస్యలు ఉన్నవారికి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని కందూరు రాంరెడ్డి కంటి ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్లు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ కార్యదర్శి దాసప్ప యాదవ్, లయన్స్‌క్లబ్ సభ్యులు మురహరి వశిష్ఠ, శివరాజ్ పాటిల్, శ్రీనివాస్‌గౌడ్, మునీర్ తదితరులు పాల్గొన్నారు.

గ్యారంటీ స్కీంలతో అధికారం ఖాయం


ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

దౌల్తాబాద్: కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ స్కీంలతో రాష్ట్రంలో అధికారం రాబోతుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్రావు అన్నారు. సోమవారం మండలంలోని దౌల్తాబాద్, గుముడాల, సుల్తాన్‌పూర్, దేశాయిపల్లి, దేవర్‌ఫసల్‌వాద్, తిమ్మారెడ్డిపల్లి, గోకఫసల్‌వాద్ తదితర గ్రామాల్లో స్కీంలపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.500లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతు రుణ మాఫీ చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీ మంజుల, వెంకట్రాములు, నర్సిములు, బీంరెడ్డి, రాములు సత్యపాల్, నర్సప్ప, మాధవరెడ్డి తదితరులున్నారు.

▲ గెలుపును ఆపలేరు

తాండూరు రూరల్: తాండూరులో కాంగ్రెస్ పార్టీ గెలుపును ఎవరూ ఆపలేరని ఆపార్టీ సీనియర్ నాయకులు ఉత్తమ్‌చందు అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఉద్దాండపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ అధ్యక్షుడు లొంక నర్సిములు ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఉత్తమ్‌చందు మాట్లాడుతూ.. రెండు, మూడు రోజుల్లో తాండూరు టికెట్‌పై క్లారిటీ వస్తోందన్నారు. బీఆర్ఎస్‌పై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు.

▲ అభయ హస్తంతో ఆదుకుంటాం

కొడంగల్ : కాంగ్రెస్ ప్రకటించిన గ్యారంటీ పథకాలతో పేదలను ఆదుకుంటామని కొడంగల్ మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో ఆయన ప్రచారం నిర్వహించారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డిని గెలిపించాలని ఓటర్లను కోరారు. రేవంత్ గెలిస్తే ముఖ్యమంత్రి అవుతారని కొడంగల్ అభివృద్ధి చెందుతుందని ప్రజలకు వివరించారు. తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ పార్టీ భరోసాను కల్పించిందన్నారు. మున్సిపల్ పరిధిలో ప్రతి ఇంటికి తిరిగి కాంగ్రెస్ ఆరు గ్యారంటీల గురించి ప్రచారం చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే పేదలకు మేలు జరుగుతుందన్నారు. అభయ హస్తం పేరుతో సంక్షేమ పథకాలకు రూపకల్పన చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు మహ్మద్ యూసూఫ్, కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షుడు ప్రశాంత్, నయీం, ఆసీఫ్‌ఖాన్, దాము, రాము తదితరులు పాల్గొన్నారు.

▲ కాంగ్రెస్‌తోనే పేదల అభ్యున్నతి

కుల్కచర్ల: పేదల అభ్యున్నతికి కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తోందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు గోపాల్‌నాయక్ అన్నారు. సోమవారం మండలంలోని ఇప్పాయిపల్లిలో ఇంటింటికీ వెళ్లి గ్యారంటీ పథకాలపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద ప్రజలకు సంక్షేమ పథకాలను అందించిన ఘనత ఒక్క కాంగ్రెస్ పార్టీకి మాత్రమే చెందుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.


కుల్కచర్ల: పథకాలపై ప్రచారం చేస్తున్న నేతలు


కొడంగల్ : ప్రచారం చేస్తున్న మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి